# పునర్వైభవం దిశగా..

**మరో పతకంపై కన్నేసిన భారత హాకీ జట్టు • నాకౌట్ స్టేజ్‌కు పక్కా! • దిగ్గజాలకు చివరి అవకాశం**



*నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*

ఒలింపిక్స్‌లో భారత హాకీది మరే దేశానికీ లేని ఘనమైన చరిత్ర. ఒక్కటి కాదు రెండు కాదు వరుసగా ఆరు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలతో భారత జైత్రయాత్ర అప్రతిహతంగా సాగింది. విశ్వక్రీడల్లో భారత్ మొత్తం పది స్వర్ణాలు గెలిస్తే అందులో హాకీకి వచ్చినవే 8. అదీగాక మనకు తొలి పతకం దక్కిందే ఈ క్రీడలో.. 1928 అమెస్టర్‌డామ్ ఒలింపిక్స్ నుంచి 1956 (మెల్‌బోర్న్) దాకా 'మెన్ ఇన్ బ్లూ'ను ఓడించిన జట్టే లేదు. భారత్‌కు ఒలింపిక్స్‌లో 35 పతకాలు రాగా అందులో హాకీ వాటానే 12 అంటే ఈ క్రీడలో మన ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. హాకీలో 1980 తర్వాత 41 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2020 టోక్యోలో భారత జట్టు కాంస్యం నెగ్గింది. 'పారిస్'లోనూ అదే ప్రదర్శనను పునరావృతం చేస్తూ పతకం రంగు మార్చి హాకీకి పునర్వైభవం తేవాలని అభిమానులు ఆశిస్తున్న నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు ఆ అంచనాలను అందుకోగలదా..?

### స్వర్ణయుగం

నాలుగేండ్లకోసారి జరిగే ఒలింపిక్స్‌లో 1928 నుంచి 1960 దాకా ఒలింపిక్స్‌లో ఆడిన ఏ ఒక్క మ్యాచ్‌నూ (30-0) మనం ఓడిపోలేదు. దేశ హాకీ చరిత్రలో ఈ కాలాన్ని స్వర్ణయుగంగా పిలుస్తారు. ఇక 1928, 1956 ఒలింపిక్స్‌లో అయితే భారత జట్టు ప్రత్యర్థులను ఒక్క గోల్ కూడా కొట్టనీయకుండా నిలువరించింది. జైపాల్ సింగ్ ముండా, లాల్ షేక్ బొఖారి, ధ్యాన్‌చంద్, కిషన్ లాల్, కేడీ సింగ్, బల్బీర్ సింగ్, చరణ్‌జిత్ సింగ్ సారథ్యంలో మన హాకీ జట్టు పసిడి పతకాల దండయాత్ర సాగించింది. 1960 తర్వాత మన ఆధిపత్యం కాస్త



తగ్గినా మళ్లీ 1968 నుంచి 1980 దాకా వరుసగా పతకాల బాట పట్టింది. కానీ ఆ తర్వాత ఈ క్రీడలో మనకు పతకం దక్కడానికి నాలుగు దశాబ్దాలు వేచి చూడాల్సి వచ్చింది.

### పడుతూ లేస్తూ..

గతేడాది ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచి 'పారిస్' కోటా దక్కించుకున్న భారత జట్టు ప్రయాణం గత ఏడాదిన్నర కాలంగా ఒడిదొడుకుల మధ్యే సాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో భువనేశ్వర్, రూర్కెలా వేదికగా జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత్.. స్పెయిన్, అర్జెంటీనా, నెదర్లాండ్స్‌ను ఓడించినా ఆస్ట్రేలియా, ఐర్లాండ్ చేతిలో ఓడింది. ఏప్రిల్‌లో పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లోనూ ఒక్క మ్యాచ్ గెలవలేదు. మే లో ముగిసిన ప్రో లీగ్‌లోనూ మన ప్రదర్శన అంతంతమాత్రమే. అయితే జట్టులోకి వచ్చిన కొత్త ఆటగాళ్లతో చేసిన ప్రయోగాలతో ఫలితాలు తమకు అనుకూలంగా రాలేదని, పారిస్‌కు కోర్ టీమ్‌ను తయారుచేయడానికి ఈ ఫలితాలు తమకు ఎంతో ఉపయుక్తమయ్యాయని భారత చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ అభిప్రాయపడుతున్నాడు. అతడి మార్గనిర్దేశకత్వంలో మన జట్టు ఆటతీరులోనూ మార్పు వచ్చింది. పటిష్టమైన డిఫెన్స్‌తో పాటు ప్రత్యర్థి గోల్ పోస్ట్ పైకి దూకుడుగా దాడి చేయడంలో మన కుర్రాళ్లు రాటుదేలారు.

**ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన**

| | | | |
|---|---|---|---|
| 1928 | స్వర్ణం | 1960 | రజతం |
| 1932 | స్వర్ణం | 1964 | స్వర్ణం |
| 1936 | స్వర్ణం | 1968 | కాంస్యం |
| 1948 | స్వర్ణం | 1972 | కాంస్యం |
| 1952 | స్వర్ణం | 1980 | స్వర్ణం |
| 1956 | స్వర్ణం | 2020 | కాంస్యం |

### జట్టు సమతూకం

తమ సుదీర్ఘ కెరీర్‌లో నాలుగో ఒలింపిక్స్ ఆడనున్న గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్, మన్‌ప్రీత్ సింగ్ వంటి వెటరన్ల అండగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో సుఖ్‌జీత్ సింగ్, సంజయ్ అభిషేక్, రాజ్‌కుమార్, జర్మన్‌ప్రీత్ వంటి కుర్రాళ్ల కలయికతో జట్టు సమతూకంగా ఉంది. టోక్యోలో కాంస్యం గెలిచిన బృందంలోని 11 మంది ప్రస్తుతం జట్టులో ఉన్నారు. హార్దిక్ సింగ్, వివేక్ సాగర్, మన్‌దీప్ సింగ్ వంటి మిడ్ ఫీల్డర్లు, శ్రీజేష్ వంటి ఆటగాళ్లు భారత్‌కు కీలకం. ఒలింపిక్స్ తర్వాత రిటైర్ అవనున్న శ్రీజేష్‌తో పాటు మరికొందరు సీనియర్లకు ఇదే చివరి అవకాశం.

### నాకౌట్‌కు పక్కా!

గ్రూప్-బీ లో ఉన్న భారత్ లీగ్ దశలో ఐదు మ్యాచ్‌లు ఆడనుండగా నాకౌట్ స్టేజ్‌కు వెళ్లడం పెద్ద కష్టమేమీ కాదు. తన తొలి మూడు మ్యాచ్‌లను న్యూజిలాండ్, అర్జెంటీనా, ఐర్లాండ్‌తో ఆడాల్సి ఉండగా చివరి రెండు మ్యాచ్‌లలో తన కంటే మెరుగైన ర్యాంకు కలిగిన ఆస్ట్రేలియా, బెల్జియంతో తలపడనుంది. మొదటి మూడు మ్యాచ్‌లలో గెలిస్తే భారత్ నాకౌట్ దశకు చేరుకున్నట్టే.

## ఇగ మీ దయ: పీసీబీ

కరాచీ: వచ్చే ఏడాది జరుగబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్ పాల్గొంటుందా? లేదా? అన్న సందిగ్ధంలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆ బాధ్యతలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి వదిలేసింది. చాంపియన్స్ ట్రోఫీ ముసాయిదా షెడ్యూల్, బడ్జెట్, తదితర వివరాలను ఇటీవలే కొలంబో వేదికగా ముగిసిన వార్షిక సమావేశంలో ఐసీసీకి సమర్పించిన పీసీబీ.. షెడ్యూల్ విషయంలో తమ పాత్ర ముగిసిందని, ఇక నిర్ణయం ఐసీసీదే అని తెలిపింది.

## గంభీర్ శిక్షణ షురూ



పల్లెకెలె(శ్రీలంక): భారత కొత్త కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతం గంభీర్ శిక్షణ మొదలుపెట్టాడు. ఈ నెల 27 నుంచి మొదలయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ఇప్పటికే శ్రీలంకకు చేరుకున్న టీమ్ఇండియా మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. చీఫ్ కోచ్ గంభీర్..ప్రాక్టీస్‌లో సంజూ శాంసన్‌కు బ్యాటింగ్‌లో చిట్కాలు చెప్పగా, ఆల్‌రౌండర్ శివమ్ దూబేతో ముచ్చటించాడు. గంభీర్ కోచింగ్ టీమ్‌లో ప్రస్తుతం అభిషేక్‌నాయర్, ర్యాన్‌టెన్ డస్కటె, దిలీప్, సాయిరాజ్ బహుతులే ఉన్నారు. ఈ నెల 27న భారత్, శ్రీలంక మధ్య తొలి టీ20 పోరు జరుగనుంది.




## అసలంక సారథ్యంలో..



పల్లెకెలె (శ్రీలంక): స్వదేశంలో భారత్‌తో త్వరలో మొదలుకావాల్సి ఉన్న మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం శ్రీలంక జట్టుకు చరిత అసలంక సారథిగా వ్యవహరించనున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో వనిందు హసరంగ దారుణ వైఫల్యంతో అతడు కెప్టెన్‌గా వైదొలగగా శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) తాజాగా అసలంకకు ఆ బాధ్యతలు అప్పగించింది. ఈనెల 27, 28, 30న మూడు టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి.

## హర్మన్‌ప్రీత్ @ 11



దుబాయ్: భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, డాషింగ్ ఓపెనర్ షెఫాలీవర్మ టీ20 ర్యాంకింగ్స్‌లో ఆకట్టుకున్నారు. మంగళవారం ఐసీసీ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్‌కౌర్ ఒక ర్యాంక్ మెరుగుపర్చుకుని 11వ ర్యాంక్‌కు చేరుకోగా, షఫాలీ నాలుగు ర్యాంక్‌లు ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలిచింది. పాయింట్ల (618) పరంగా ఇద్దరు బ్యాటర్లు సమంగా ఉన్నారు. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన(731) ఐదో ర్యాంక్‌లో కొనసాగుతుండగా, టాప్-20లో భారత్ నుంచి జెమీమా రోడ్రిగ్స్(593) 19వ ర్యాంక్‌లో ఉంది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ (748), రేణుకాసింగ్ (692) వరుసగా రెండు, తొమ్మిది ర్యాంక్‌ల్లో ఉన్నారు.

## ఆటలకు అరకొర నిధులే!

**గతేడాదితో పోల్చితే పెరిగింది రూ. 45 కోట్లే**



ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో క్రీడారంగానికి అరకొర నిధులే దక్కాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ క్రీడలకు ఈ బడ్జెట్‌లో రూ. 3,442.32 కోట్ల కేటాయింపులు చేశారు. గతేడాది (రూ. 3,396.80 కోట్లు)తో పోలిస్తే తాజా బడ్జెట్‌లో పెరిగింది రూ. 45.36 కోట్లు మాత్రమే. ఇక గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను వెలికితీసేందుకు మోడీ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఖేలో ఇండియా' కార్యక్రమానికి రూ. 900 కోట్లను కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం కంటే అదనంగా ఇచ్చింది రూ. 20 కోట్లే. జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)కు రూ. 340 కోట్లు, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ 'టాప్స్'కు రూ. 822.60 కోట్లు, నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా)కి రూ. 22.30 కోట్లు, నేషనల్ డోప్ టెస్టింగ్ లేబోరేటరీ (ఎన్‌డీటీఎల్)కు రూ. 22 కోట్లు కేటాయిస్తున్నట్టు నిర్మల పేర్కొన్నారు.

## షెఫాలీ ధనాధన్

**• నేపాల్‌పై భారత్ ఘన విజయం**




దంబుల్లా: మహిళల ఆసియా కప్‌లో భారత జట్టు లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌లను గెలిచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' షఫాలీ వర్మ (48 బంతుల్లో 81, 12 ఫోర్లు, 1 సిక్స్) అంతగా అనుభవం లేని నేపాల్ బౌలర్లను ఉతికారేసింది. షఫాలీ, స్మృతి మంధాన స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన హేమలత (42 బంతుల్లో 47, 5 ఫోర్లు, 1 సిక్స్)తో తొలి వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే ఓపెనర్ల వికెట్లు కోల్పోయాక భారత స్కోరు వేగం నెమ్మదించింది. అనంతరం ఛేదనలో నేపాల్ 20 ఓవర్లు ఆడి 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులే చేయగలిగింది. రాణా మగర్ (18) టాప్ స్కోరర్. దీప్తి శర్మ(3/13), రాధా యాదవ్ (2/12), అరుంధతిరెడ్డి(2/28) రాణించారు. సెమీస్‌లో భారత్.. థాయ్‌లాండ్ లేదా బంగ్లాదేశ్‌తో తలపడే అవకాశాలున్నాయి.

## ద్రవిడ్ ఏడ్చేశాడు: అశ్విన్



చెన్నై: వెస్టిండీస్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలిచిన తర్వాత అటు ప్లేయర్లతో పాటు కోచింగ్, సహాయక సిబ్బంది తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదీర్ఘ కల సాకారమైన వేళ ఉబికివస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ సహచరులతో కలిసి గెలుపు సంబురాల్లో పాల్గొన్నారు. ఇదే సందర్భంలో కోహ్లీ..టీ20 ప్రపంచకప్ ట్రోఫీని రాహుల్ ద్రవిడ్‌కు అందజేశాడు. కప్ అందుకున్న వెంటనే ఒక్కసారిగా గట్టిగా అరుస్తూ ద్రవిడ్ కండ్లకు నీళ్లు తెచ్చుకున్నాడని సీనియర్ స్పిన్నర్ అశ్విన్ చెప్పుకొచ్చాడు. యూట్యూబ్ చానల్‌తో అశ్విన్ మాట్లాడుతూ 'కోహ్లీ కప్ ఇచ్చిన తర్వాత ద్రవిడ్ ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యాడు. అప్పటి వరకు గంభీరంగా ఉన్న ద్రవిడ్ కప్‌ను హత్తుకుని ఏడ్చేశాడు' అని అన్నాడు. 2007 వన్డే ప్రపంచకప్‌లో ద్రవిడ్ కెప్టెన్సీలో భారత్ లీగ్ దశలోనే నిష్క్రమించగా, ప్లేయర్‌గా కాకపోయినా..కోచ్‌గా అతని ప్రపంచకప్ కలను నిజం చేసుకున్నాడని అశ్విన్ పేర్కొన్నాడు. ద్రవిడ్ హయంలో జట్టును సమతూకంగా మార్చాడని, దాని వెనుక అతని కష్టం ఎంతో దాగుందని అన్నాడు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.